Namasthe Telangana    Dt 28/12/17.

# మెట్రోరైలుకు ప్రజాదరణ

**రేపటితో 30 రోజులు.. రోజుకు సగటున లక్ష మంది ప్రయాణం**

**వచ్చే జూన్‌లో అందుబాటులోకి హైటెక్‌సిటీ, ఎల్బీనగర్ మార్గాలు**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నగర చరిత్రలో అనేక గొప్ప నిర్మాణాల్లో ఒకటిగా చెప్పుకోదగ్గ మెట్రోరైలు ప్రాజెక్టు ప్రారంభమై శుక్రవారానికి నెల రోజులు పూర్తికానున్నది. గత నెల 28న ప్రధాని నరేంద్ర మోదీ మెట్రోరైలును ప్రారంభించగా, మరుసటిరోజు నుంచి మియాపూర్ నుంచి నాగోల్ వరకు ప్రజా రవాణాకు అనుమతిచ్చారు. మెట్రోరైలు ప్రారంభమైన మొదటిరోజు నుంచి నిత్యం సగటున లక్ష మందిని గమ్యస్థానాలకు చేర్చి నెలరోజుల్లో 30 లక్షల మందిని మోసుకెళ్లింది. 30 కిలోమీటర్ల నాగోల్ నుంచి మియాపూర్ మార్గాల్లో నగరవాసులు ప్రయాణిస్తూ గమ్యానికి చేరుతున్నారు. దీంతో రోడ్లపై వాహనాల రద్దీ కూడా తగ్గింది. రాష్ట్రంలోనే 2017లో అందుబాటులోకి వచ్చిన అతిపెద్ద ప్రాజెక్టుగా మెట్రోరైలు ఖ్యాతి దక్కించుకున్నది. నెలరోజుల్లో మెట్రో ప్రయాణం సాఫీగా సాగడంతోపాటు నగరవాసులు కూడా మెట్రోరైలుకే ఓటువేసి మద్దతుగా నిలుస్తున్నారు. పరిశుభ్రత, క్రమశిక్షణలో ప్రయాణికుల తీరు ఎక్కడా వివాదాస్పదం కాకపోవడం విశేషం. వచ్చే ఏడాది జూన్‌లోగా కారిడార్-1లో మిగిలి ఉన్న అమీర్‌పేట-ఎల్బీనగర్, కారిడార్-3లో అమీర్‌పేట-హైటెక్‌సిటీ మార్గాలను అందుబాటులోకి తేనున్నారు. ఈ మార్గాల్లో జూన్ మూడోవారంలో అధికారులు ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు. జూన్ చివరి వారంలో ప్రజలకు అందుబాటులోకి తేనున్నారు. ఇందుకు



పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటికే మెట్రోరైలు నడుస్తున్న మార్గంలో స్టేషన్ల బ్యూటిఫికేషన్‌తోపాటు అర్బన్‌రెజ్యువినేషన్ పనులు కొనసాగుతున్నాయి.

## గొప్ప అనుభూతి



ఎన్నో కష్టాలుపడి మెట్రోరైలును ప్రారంభించడం, అది విజయవంతమై నెలరోజులు పూర్తిచేసుకోవడం గొప్ప అనుభూతిని కలిగిస్తున్నది. అప్పుడే నెలరోజులు గడిచిందా అన్నంత సులభంగా మెట్రో సాగిపోతున్నది. మెట్రోరైలును ప్రారంభించిన రోజు నాకు అత్యంత ప్రత్యేకమైన రోజు. అనేక సవాళ్లను ఎదుర్కొన్నాం.. కానీ నడుస్తున్న మెట్రోరైలును చూస్తే కష్టాలను మించి సంతోషం కలుగుతున్నది. దీనిని ఆస్వాదిస్తూనే మిగిలిన పనులను పూర్తిచేస్తాం. తెలంగాణ రాష్ట్రం వస్తే మూసుకొని వెళ్లాల్సివస్తుందని కొందరు ప్రచారం చేశారు. అది నిజం కాదని తేలింది. ప్రభుత్వం మెట్రోరైలుపై ప్రత్యేకదృష్టిసారించి అవాస్తవాలకు అడ్డుకట్టవేసింది. ఇప్పుడున్న మూడు కారిడార్లతోపాటు ఇతర మార్గాల్లో విస్తరించాలనే డిమాండ్ ఉన్నది. ఇది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది. సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా అర్బన్ రెజ్యువేషన్ పనులు చేస్తున్నాం. మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే మెట్రోరైలులో నిత్యం 15 లక్షల మంది ప్రయాణం సాగిస్తారు.

- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి